డెంగీని నివారించాలి

- ప్రజలు భాగస్వాములు కావాలి
- పీహెచ్‌సీ డాక్టర్ల పిలుపు


వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న వైద్యులు

మద్దిపాడు: ప్రజల భాగస్వామ్యంతో డెంగీ జ్వరాలు రాకుండా నివారించాలని పీహెచ్‌సీ డాక్టర్‌లు శ్రావణ్, జగదీష్, వినీల చౌదరి, శిరీష చంద్ర అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన ఒక కార్యక్రమంలో పాల్గొని వారు వైద్య శాఖ సిబ్బందితో మాట్లాడారు. ఈ సందర్భంగా గ్రామాల్లో ప్రజలు డ్రైడే పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని, అదే విధంగా ఇంటి పరిసర ప్రాంతాల్లో కొబ్బరికాయలు టైర్లలో నీరు నిలిచి ఉండకుండా చూసుకోవాలని, అదేవిధంగా పాతకాలపు రోళ్లలో నీరు లేకండా చూసుకునే విధంగా ప్రజలకు అవగాహన కల్పించాలని వైద్యశాఖ సిబ్బందికి సూచనలు చేశారు. డెంగీ జ్వరాలు రాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకునే విధంగా ప్రజలను చైతన్యవంతులను చేయాలని డాక్టర్‌లు కోరారు. అనంతరం మద్దిపాడు వీధుల్లో డెంగీ వ్యాధిపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ చేశారు. వారి వెంట సీహెచ్‌ఓ లలితమ్మ, పీహెచ్ఎన్ పద్మావతి, సూపర్‌వైజర్లు బాలకోటయ్య, సీతాదేవి, నాగరాజి పాల్గొన్నారు.

క్లుప్తంగా

మంత్రి మేరుగు పరామర్శ


హనుమాయమ్మకు నివాళులర్పిస్తున్న మంత్రి మేరుగు నాగార్జున

చీమకుర్తి రూరల్ (చీమకుర్తి): మండలంలోని చంద్రపాడు గ్రామ వైఎస్సార్ సీపీ నాయకుడు వల్లంరెడ్డి సుబ్బారెడ్డి, చంద్రపాడు వైస్ సర్పంచ్ వాకా సంజీవరెడ్డిలను మంత్రి మేరుగు నాగార్జున గురువారం పరామర్శించారు. చంద్రపాడు వైఎస్సార్ సీపీ నాయకులు వల్లంరెడ్డి సుబ్బారెడ్డి భార్య, చంద్రపాడు వైస్ సర్పంచ్ వాకా సంజీవరెడ్డి సోదరి వల్లంరెడ్డి హనుమాయమ్మ అనారోగ్యంతో బుధవారం మృతి చెందారు. ఈ సందర్భంగా సంతనూతలపాడు నియోజకవర్గ వైఎస్సార్ సీపీ అభ్యర్థి మేరుగు నాగార్జున చంద్రపాడు వారి గృహానికి వెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన వెంట ఎంపీపీ యద్దనపూడి శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

బైండోవర్ నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న సీఐ సోమయ్య

గిద్దలూరు రూరల్: బైండోవర్ అయిన వ్యక్తులు ఫోర్త్ ఫ్యూచర్ ఆఫ్ బాండ్స్‌పై అవగాహన కలిగి, నిబంధనలు పాటించాలని సీఐ వైవీ సోమయ్య స్పష్టం చేశారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. కౌంటింగ్ సమయంలో లేదా ఫలితాలు వెల్లడించిన తర్వాత బైండోవర్‌లో ఉన్నవారు అల్లర్లకు పాల్పడకుండా జాగ్రత్తగా ఉండాలని సూచించారు. గిద్దలూరు మండలంలో మొత్తం 600 మందిని బైండోవర్ చేసి ప్రత్యేక నిఘా ఉంచినట్లు చెప్పారు. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సై తోట వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

అధిక శబ్దాలతో బైక్‌లు నడిపితే చర్యలు


పోలీసులు సీజ్ చేసిన స్పోర్ట్స్ బైక్

కంభం: బుల్లెట్ బైక్‌ల సైలెన్సర్లు మార్పు చేసి అధిక శబ్దాలతో ప్రజలను ఇబ్బంది పెడితే సీజ్ చేయడంతోపాటు కఠిన చర్యలు తీసుకుంటామని స్థానిక ఎస్సై పులి రాజేష్ హెచ్చరించారు. గురువారం తనిఖీల్లో పట్టుబడిన పలు బుల్లెట్ వాహనాలు, స్పోర్ట్స్ బైకులకు జరిమానా విధించి, వాహనదారులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బైక్‌లు కొనుగోలు చేసేటప్పుడు ఉన్న సైలెన్సర్లనే వినియోగించాలని స్పష్టం చేశారు.

భారీ మెజార్టీతో వైఎస్సార్ సీపీ గెలుపు


మాట్లాడుతున్న వెన్నా హనుమారెడ్డి

యర్రగొండపాలెం: రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాన్‌గాలి వీస్తోందని, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ సీఎంగా చేసుకోవాలన్న తపనతో ప్రజలు సార్వత్రిక ఎన్నికల్లో పెద్ద ఎత్తున పాల్గొన్నారని, ఈ ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో గెలుపొందుతారని యర్రగొండపాలెం నియోజకవర్గ ఎన్నికల అబ్జర్వర్ వెన్నా హనుమారెడ్డి అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయనతో కలిసిన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గంలో పోలింగ్ సరళి పరిశీలిస్తే వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్, ఒంగోలు పార్లమెంటు అభ్యర్థి చెవిరెడ్డి భాస్కర రెడ్డి భారీ మెజార్టీతో గెలుపొందుతారని తెలుస్తోందని పేర్కొన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్ల పాలనలో అమలు పరిచిన నవరత్నాల పథకాలు పార్టీకి శ్రీరామరక్షగా నిలిచాయని, తిరిగి ఈ పథకాలను మరింత మెరుగ్గా అమలు పరుచుకోవటానికి అన్నివర్గాలకు చెందిన పేదలు ఫ్యాన్ గుర్తుపై ఓట్లు వేశారని చెప్పారు. ఓటమి భయంతో పచ్చ కూటమి అల్లర్లకు దిగుతున్నారని, హింసా కాండకు సృష్టిస్తున్నారని, గ్రామాల్లో రెచ్చగొట్టే చర్యలకు దిగుతున్నారని ఆయన తెలిపారు. వైఎస్సార్ సీపీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు సంయమనంతో ఉండాలని ఆయన సూచించారు.

జిల్లా గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతులు


వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

ఒంగోలు టౌన్: చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా జిల్లా కేంద్ర గ్రంథాలయంలో విద్యార్థులకు వేసవి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు కార్యదర్శి కాసు ఆదిలక్ష్మి తెలిపారు. గురువారం వేసవి శిక్షణలో ఆమె మాట్లాడుతూ చిన్నారులకు పుస్తక పఠనాన్ని అలవాటు చేయడంతో పాటు వారిలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు వేసవి శిక్షణ కార్యక్రమంలో కృషి చేస్తున్నట్లు తెలిపారు. 6 నుంచి 10వ తరగతి వరకు 15 సంవత్సరాల్లోపు విద్యార్థులకు ప్రతిరోజూ ఉదయం 8 నుంచి 11.30 గంటల వరకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని జిల్లా గ్రంథాలయ ఉప పాలకురాలు బొమ్మల కోటేశ్వరి వివరించారు. కథలు చదివి వినిపించడం, పుస్తకాలు చదవడం, స్పేర్ టైం యాక్టివిటీస్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, డ్రామా, బొమ్మలు తయారు చేయడం, స్పోకెన్ ఇంగ్లిష్ తదితర అంశాలలో నిపుణులచే శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. విద్యార్థులు, తలిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పెన్సిల్ లెడ్లపై వాసవీ కన్యకాపరమేశ్వరి జీవిత చరిత్ర

- లిఖించిన సూక్ష్మ కళాకారిణి అన్నం మహిత
- రేపు పెనుగొండలో వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయానికి సమర్పణ


వాసవీ కన్యకాపరమేశ్వరి జీవిత చరిత్రతో అన్నం మహిత

ఒంగోలు మెట్రో: వాసవీ కన్యకాపరమేశ్వరీదేవి పుట్టినరోజు వేడుకలను పురస్కరించుకుని బాపట్ల జిల్లా చీరాల మండలం స్వర్ణ గ్రామానికి చెందిన అన్నం నరసింహారావు భ్రమరాంబ దంపతుల కుమార్తె, సూక్ష్మ కళాకారిణి అన్నం మహిత వాసవీ కన్యకాపరమేశ్వరి జీవిత చరిత్రను పెన్సిల్ లెడ్లపై ఆంగ్ల భాషలో లిఖించింది. ఆ చిత్రపటాన్ని ఒంగోలు వాసవీ కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో అమ్మవారి పాదాల చెంత ఉంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అన్నం మహిత మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా అమ్మవారి జీవిత చరిత్రను లిఖించాలనుకున్నాను, అమ్మ కృపతో ఇప్పటికి నా సంకల్పం నెరవేరింది, ఈ నెల 18వ తేదీ ఈ చిత్రపటాన్ని పెనుగొండలోని వాసవీ కన్యకాపరమేశ్వరి మూలమూర్తి ఆలయంలో సమర్పించడం జరుగుతుందని తెలిపారు. ఐదు రోజుల వ్యవధిలో ఈ చిత్రపటాన్ని పూర్తి చేశానని, నా తల్లిదండ్రుల ప్రోత్సాహంతో సూక్ష్మ ఖండాల తయారు చేస్తున్నానని తెలిపారు. గతంలో 720 పెన్సిళ్లపై భగవద్గీత పూర్తి శ్లోకాలను, అలాగే పొట్టి శ్రీరాములు జీవిత చరిత్ర, నందమూరి తారక రామారావు జీవిత చరిత్ర, అక్కినేని నాగేశ్వరరావు జీవిత చరిత్ర, కరుణానిధి జీవిత చరిత్ర.. ఇలా ఎన్నో గొప్ప వారి జీవిత చరిత్రలు రాసి వారి కుటుంబ సభ్యులకు అందించడం జరిగిందని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషుల ప్రోత్సాహంతో సూక్ష్మ కళాకారిణిగా ఎదుగుతున్నానని, ప్రతిఒక్కరూ తన కళను ఆదరించాలని ఆమె కోరారు.

నేడు సీతా అమ్మవారి జన్మదిన మహోత్సవాలు


కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఆలిండియా కళారంగ సభ్యులు

- ఆలిండియా కళారంగం వారిచే సంగీత విభావరి, చిన్నారులచే నృత్య ప్రదర్శన

ఒంగోలు మెట్రో: వైశాఖ శుద్ధ నవమి ఈ నెల 17వ తేదీ శుక్రవారం సీతా అమ్మవారి జన్మదిన వేడుకలను స్థానిక సత్యనారాయణపురం దిబ్బలరోడ్డులోని సీతా సమేత కోదండరామస్వామి దేవస్థానంలో ఉదయం 8 గంటలకు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. సీతా అమ్మవారికి వివిధ రకాల పూలతో పుష్పాలంకరణ, కుంకుమ పూజ, శ్రీరామచంద్రుల వారికి అష్టోత్తర శతనామావళి పూజ, అనంతరం మంత్రపుష్పం, హారతి, తీర్థ ప్రసాద వితరణ జరుగుతుందన్నారు. సాయంత్రం ఆరు గంటలకు ఆలిండియా కళారంగం పద్మశ్రీ ఘంటసాల స్వరాంజలి అధ్యక్షురాలు డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ నిర్వహణలో గాయనీ గాయకులు ఏ మనోహర్, డి.కోటేశ్వరరావు, టి.శ్రీదేవి, సీహెచ్ నాగేశ్వరమ్మ భక్తి సంగీత విభావరి, చిన్నారులచే నృత్య ప్రదర్శన నిర్వహించనున్నట్లు వివరించారు. కళారంగ అభిమానులు, కళాపోషకులందరూ పాల్గొని విజయవంతం చేయాలని ఆలిండియా కళా రంగం ప్రకాశం జిల్లా అధ్యక్షురాలు డాక్టర్ చల్లా నాగేశ్వరమ్మ తెలిపారు. అనంతరం కరపత్రాల ఆవిష్కరణ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వేమూరి శ్రీనివాసరావు, అర్చక స్వామి రాము శర్మ, లక్ష్మీమాధవి, అనూరాధ, స్థానిక భక్తులు పాల్గొన్నారు.

3,241 మందిపై బైండోవర్ కేసులు

చీమకుర్తి: అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా సంతనూతలపాడు నియోజకవర్గంలోని నాలుగు మండలాల పరిధిలో 3,241 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు చీమకుర్తి సీఐ దుర్గాప్రసాద్ గురవారం ఒక ప్రకటనలో తెలిపారు. చీమకుర్తి పోలీస్‌స్టేషన్ పరిధిలో 1126 మంది, సంతనూతలపాడు స్టేషన్ పరిధిలో 548 మంది, మద్దిపాడు స్టేషన్ పరిధిలో 763 మంది, నాగులుప్పలపాడు స్టేషన్ పరిధిలో 804 మందిపై బైండోవర్ కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు. హిస్టరీ షీటర్స్ (రౌడీ షీటర్స్), సస్పెక్ట్ పర్సన్స్, ట్రబుల్ మాంగర్స్, ప్రీవియస్ ఎలక్టోరల్ అఫెండర్స్ వారి నేర చరిత్ర ఆధారంగా అన్ని రాజకీయ పక్షాల్లో ట్రబుల్ మాంగర్స్‌ను గుర్తించి వారిపై కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు, శాంతి భద్రతలకు భంగం కలగకుండా ఉండేందుకు, ఎన్నికలు సజావుగా జరిగేందుకు వారిపై కేసులు నమోదు చేసినట్ల తెలిపారు. ఆయా మండలాల మేజిస్ట్రేట్‌ల సమక్షంలో హాజరు పరిచి రూ.లక్ష రూపాయల పూచీకత్తుతో 6 నెలల నుంచి ఏడాది కాలం పాటు సత్ప్రవర్తన కలిగి ఉంటే బైండోవర్ కేసుల నుంచి విముక్తి కలిగిస్తామన్నారు. లేకుంటే పూచీకత్తు కింద చూపిన లక్ష రూపాయలను వసూలు చేసే విధంగా వారిపై తగిన చర్యలు తీసుకుంటామని సీఐ దుర్గా ప్రసాద్ హెచ్చరించారు.

అదుపు తప్పి కారు బోల్తా

మార్కాపురం రూరల్: మార్కాపురం మండలం రాయవరం మెడికల్ కాలేజీ వద్ద కారు టైరు పేలడంతో అదుపు తప్పి బోల్తాపడిన సంఘటన గురువారం మధ్యాహ్నం చోటుచేసుకుంది. రూరల్ ఎస్సై వెంకటేశ్వరనాయక్ తెలిపిన వివరాల ప్రకారం కొనకనమిట్ల నుంచి మార్కాపురం వైపునకు వస్తున్న ఇన్నోవా కారు టైరు పేలి అదుపుతప్పి బోల్తా పడింది. కొనకనమిట్ల టీడీపీ మండల పార్టీ కన్వీనర్ మోరబోయిన బాబూరావుకు స్వల్పగాయాలయ్యాయి.

కనులపండువగా కల్యాణోత్సవం


కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలోని రెడ్డిగారిపల్లె కోదండరామస్వామి తిరునాళ్ల సందర్భంగా గురువారం సీతా సమేత కోదండరామస్వామి శాంతి కల్యాణోత్సవం రుత్వికుల వేద మంత్రాల నడుమ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో సీతా, రామ, లక్ష్మణ, హనుమంత మూల విగ్రహమూర్తులకు అభిషేకం, విశిష్ట పూజలు చేశారు. అనంతరం సీతా, రాముల ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం నిర్వహించి అనంతరం వేడుకగా ఎదురుకోల నిర్వహించి కల్యాణ మండపంపై వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా భజంత్రీల మేళతాళాల నడుమ కల్యాణం నిర్వహించారు. అనంతరం వసంతోత్సవం, గ్రామోత్సవం వైభవంగా సాగింది. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో చెన్నకేశవస్వామి బ్రహ్మోత్సవాలు


ఉత్సవంలో చెన్నకేశవస్వామి

కొనకనమిట్ల: మండలంలోని పెదారికట్ల గ్రామంలో శ్రీలక్ష్మీ చెన్నకేశవస్వామి, పార్వతి సమేత రాజనగరేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వేడుకగా సాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా గురువారం చెన్నకేశవస్వామికి అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చారణ మధ్య మంగళ వాయిద్యాలతో స్వామి వారిని ఎల్లటేనుగు వాహనంపై ఊరేగించారు. ఉత్సవ ఉభయదాతలుగా గొంటువారిపల్లి, మూలెవారిపల్లి గ్రామస్తులు వ్యవహరించారు. వేదపండితులు నంద్యాల వెంకట కృష్ణ కిరణ్, నుదురుపాటి వెంకటకృష్ణారావు స్వామివారికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. శుక్రవారం శివపార్వతుల కల్యాణం నిర్వహిస్తున్నట్లు దేవస్థాన కమిటీ సభ్యులు తెలిపారు.

డెంగీపై అప్రమత్తంగా ఉండాలి



బేస్తవారిపేటలో ర్యాలీలో పాల్గొన్న వైద్యాధికారులు పృథ్వీరాజ్, కావ్య

బేస్తవారిపేట: డెంగీ జ్వరంపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పీహెచ్‌సీ వైద్యాధికారులు పృథ్వీరాజ్, కావ్య సూచించారు. ప్రపంచ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక జంక్షన్‌లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యులు మాట్లాడుతూ.. గృహాల్లో ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉంచుకోవడం, ఇంటి పరిసరాల్లో తాగిపడేసిన కొబ్బరి బొండాలు, టైర్లు, నీటి తొట్లలో వర్షం నీరు నిల్వ చేరడం వల్ల దోమలు వృద్ధి చెందుతాయన్నారు. మంచినీరు నిల్వ ఉన్న ప్రాంతాల్లో డెంగీ దోమలు పెరిగి వ్యాప్తి చెందుతాయన్నారు. దోమల ద్వారా సంక్రమించే వ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ హబీబ్‌ఖాన్, హెచ్ఈఓ కళావతి, సబ్‌యూనిట్ అధికారి నాగేశ్వరరావు, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.


ఉప్పలపాడులో ర్యాలీలో పాల్గొన్న వైద్యారోగ్య సిబ్బంది


మార్కాపురం ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్ఓ పద్మావతి

పొదిలి: జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మండలంలోని ఉప్పలపాడు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ శరత్ చంద్ర, సబ్ యూనిట్ ఆఫీసర్ కృష్ణ ర్యాలీని ప్రారంభించారు. డెంగీ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

డెంగీని నివారించాలి

మార్కాపురం టౌన్: ప్రజలందరూ డెంగీ జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలని డీఐఎంహెచ్‌ఓ డాక్టర్ కె.పద్మావతి సూచించారు. గురువారం జాతీయ డెంగీ నివారణ దినం సందర్భంగా పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, దోమలు రాకుండా చూసుకోవాలన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి ఆర్.నాగేంద్రరెడ్డి మాట్లాడుతూ ఇంటి ముందు మురుగు కుంటలు లేకుండా చూసుకోవాలని, చెత్తా, చెదారం లేకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. మురుగు కాలువలో దోమలు పెరగకుండా కిరోసిన్ చల్లాలని తెలిపారు. డెంగీ జ్వరానికి త్వరగా చికిత్స తీసుకోవడం ద్వారా మరణాలను తగ్గించవచ్చన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఉదయ్‌చంద్ర, శ్రవణ్‌తేజ, హర్షవర్థన్‌రెడ్డి, డీపీఎంఓ సాంబిరెడ్డి, ఎంపీహెచ్ఎస్ ఆవులయ్య తదితరులు పాల్గొన్నారు.

గజ్జలకొండలో..

గజ్జలకొండ హాస్పిటల్ పరిధిలోని రాయవరంలో డాక్టర్ సాయిచరణ్‌తేజ్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రజలకు జాగ్రత్తలు తెలిపారు. హెచ్ఈఓ శ్రీకాంత్, ఎంపీహెచ్ఎస్ పెద్దన్న, హెచ్‌వీ విమలమ్మ తదితరులు పాల్గొన్నారు.

వేణుగోపాలునికి బ్రహ్మోత్సవ వైభవం



ఉలవపాడు: ఉలవపాడులో వెలసియున్న రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాల స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం నుంచి ప్రారంభం కానున్నాయి. ఉలవపాడు తిరుణాళ్లగా పేరుగాంచిన ఈ ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వస్తారు. 17వ తేదీ రాత్రి అంకురార్పణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. బ్రహ్మోత్సవాలకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రసాద్ తెలిపారు. 18న ఉదయం 10.30 గంటలకు ధ్వజారోహణం, రాత్రి 9 గంటలకు చప్పర సేవ, శేషవాహనం, 19న ఉదయం 9.30 గంటలకు చప్పరసేవ, రాత్ర 9 గంటలకు హంసవాహనం, 20న ఉదయం 9.30 గంటలకు చప్పరసేవ, రాత్రి 9 గంటలకు హంసవాహనం, 21న రాత్రి 8 గంటలకు పొన్నమాను, రాత్రి 2 గంటలకు హనుమంతసేవ, 22న రాత్రి 8 గంటలకు మోహినీ ఉత్సవం, రాత్రి 2 గంటలకు గరుడవాహన సేవ, 23 న ఉదయం 9 గంటలకు సూర్యప్రభ వాహనం, సాయంత్రం 6 గంటలకు చంద్రప్రభ వాహనం, తెల్లవారుఝామున 4 గంటలకు ఏనుగుసేవ, 24న ఉదయం 10 గంటలకు స్వామి కళ్యాణం, సాయంత్రం 5 గంటలకు రథోత్సవం, 25న ఉదయం 9 గంటలకు చప్పరసేవ, రాత్రి 9గంటలకు దొంగలదోపు, 26న ఉదయం 9 గంటలకు ముసుగుల సేవ, రాత్రి 9 గంటలకు ధ్వజారోహణం, 27న రాత్రి 9 గంటలకు ఏకాంత సేవతో ఉత్సవాలు ముగుస్తాయి.

సాంస్కృతిక కార్యక్రమాలు ఇవీ...

ఉత్సవాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటుచేశారు. 21న రాత్రి 9 గంటలకు భరతనాట్యం, 22న రాత్రి 9 గంటలకు దేవనర్తకి పూర్తి నాటకం, 23న 8 గంటలకు కోలాటం ప్రదర్శన, 10 గంటలకు రామాంజనేయ యుద్ధం సీను ప్రదర్శన, 11 గంటలకు గయోపాఖ్యానం యుద్ధ సీను ప్రదర్శించనున్నట్లు ఆయన తెలిపారు. భక్తులు బ్రహ్మోత్సవాలలో పాల్గొనాలని కోరారు.

రూ.20 లక్షలతో ఆలయ ముఖ ద్వారం, కళావేదిక


గంగమ్మతల్లి ఆలయ ముఖద్వారం



కళా వేదిక

కొనకనమిట్ల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం వెలుగొండ క్షేత్రంలోని శ్రీకృష్ణ యాదవ అన్నదాన సత్రం అభివృద్ధికి దాతల కృషి అభినందనీయమని సత్రం కమిటీ సభ్యులు పిన్నిక నాగేశ్వరరావు, ఎస్.వెంకటేశ్వర్లు, ఈర్ల బాలవెంకటేశ్వర్లు పేర్కొన్నారు. వెలుగొండ స్వామి ఆలయ సమీపంలో నిర్మించిన గంగమ్మతల్లి ఆలయానికి ముఖ ద్వారం, శ్రీకృష్ణ యాదవ అన్నదాన సత్రంలో కళా వేదిక నిర్మాణానికి రూ.20 లక్షల సొంత నిధులు వెచ్చించిన అన్నదాన సత్రం గౌరవాధ్యక్షుడు మోడి ఆంజనేయులు, కోటేశ్వరరావుకు కృతజ్ఞతలు తెలిపారు. సత్రం బయట ప్రహరీ ఏర్పాటు, ముఖద్వారం నిర్మాణాన్ని నూతన అధ్యక్షుడు, రిటైర్డ్ ఐజీ పిన్నిక హరికుమార్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు.